# కదలని బొట్టు !

ఆకాశం అంత పందిరి ! భూదేవంత అరుగు ! ఒక వంక సన్నాయి "సీతమ్మ పెళ్ళికూతురాయెనే ?" అంటూ శ్రవణపేయంగా వినవస్తోంది! పందిరి కావలగా ఎర్రని ముఖమల్ మీద తెల్లని వెండి నక్కు-పూలు కుట్టిన కోట్లు ధరించిన "ఈశ్వర్, చండీ బ్యాండ్" పార్టీవాళ్ళు "వి" ఆకారంగా నించుని "నేను పుట్టాను. లోకం నవ్వింది" అన్న సినిమా పాటను ధణాయించి వాయిస్తున్నారు. పందిరి అంతా రంగు రంగులదీపాలతో ధగధగాయమానంగా వెలిగిపోతోంది. ఆ దీపాల మెరుగులతో పోటీలుపడుతూ, ఆడవాళ్ళ పట్టుజరీ బుటాచీరలూ, రవ్వాల, కెంపుల, పచ్చలబంగారునగలూ, జిగజిగలాడుతూ మెరుస్తూ మురుస్తున్నాయి. ఆకాశంలో నక్షత్రాలన్నీ దేవలోకం క్రిందికి దిగిందేమిటా అని వింతపడుతూ భూమిమీదకి వంగి తొంగితొంగి చూస్తున్నాయి. కామేశ్వరి కిదంతా అద్భుతమైన టెక్నికలర్ చిత్రం చూస్తున్నట్లు అన్పించింది. ముందు కామేశ్వరి "రజనీశర్మ పెళ్ళికి రానంటే రానంది. అంతరానిదానికి ప్రజంటేషన్‌కి చందా ఎందుకు ఇచ్చేవు?" అందిమీనాక్షి. రెండేళ్ళక్రితం కామేశ్వరీ, రజనీ, మీనాక్షి ఇంకా వివిధనామధేయాలతో వివిధవర్గాల లోంచీ, వర్ణాలలోంచీ, వచ్చిన పన్నెండుమంది అమ్మాయిలు - రెండేళ్ళు కలిసిమెలిసి యూనివర్సిటీలో ఎం. ఏ. చదివారు. ఎవళ్ళ ఆర్థికస్తోమతుకి తగ్గ క్లాసులు వాళ్ళు

తెచ్చుకున్నారు. రజనికి అందరికన్నా ముందు కళ్యాణతారక కలిసి వచ్చింది, వివాహం అవుతోంది! మీనాక్షి మిగతా వాళ్ళందరి దగ్గర, డబ్బుచందా ఎత్తి, ప్రెషర్ కుక్కర్ కొన్నది. అందరితో బాటు, కామేశ్వరీ అయిదు రూపాయల చందా ఇచ్చింది. ఆ అయిదు రూపాయలు ఇవ్వటానికే కామేశ్వరి ఎంతో సిగ్గుపడింది.

"నేనేం ఇచ్చాను ? ఆ అయిదు రూపాయలు ఇవ్వ టానికే మా ఇంట్లో నేను ఎంతో సిగ్గుపడి అడగాల్సి వచ్చిందే! వివాహాలూ, విందులూ, నాలాంటివాళ్ళకి కాదే మీనా !" అంది కామేశ్వరి.

"నేను మటుకు ఎంత ఇవ్వగలిగాను పదిహేనే కదా! ఎవళ్ళ స్తోమత వాళ్ళదీ ! కళ్యాణీ, గిరిజా పాతికేసి రూపా యలు ఇచ్చేరు. మేరీ డిసౌజా ముప్ఫయి రూపాయలు ఇచ్చింది. సరదాగా రెండేళ్ళు కలిసి చదివాం ! ముందుగా తను గృహిణి అవుతోంది. వెళ్ళివస్తే తప్పేమిటి ?" అంది.

"నాకు ఫంక్షన్స్‌కి కట్టుకోగలిగినంత మంచి చీరలేమీ లేవు !" అంది ఆఖరికి.

"ఓస్ ! అదా సంగతి! నాదో చీర తీసుకో !" అంది మీనాక్షి.

లేత గులాబీరంగు నైలక్స్ చీరమీద అక్కడక్కడా చిన్న చిన్న జరీపూలున్నది తీసుకొని కట్టుకుంది. కామేశ్వరి దానికి మేచయ్యే ముదురు గులాబీరంగు రుబీజాకెట్టు వేసు కుంది. తయారయ్యి వచ్చిందన్నమాటేగానీ అక్కడి వాతా

వరణం చూడగానే బిక్కచచ్చిపోయింది. క్రమక్రమంగా, పెళ్ళిమంత్రాల జోరూ, ఆహూతుల పలకరింపులూ, సన్నాయి సంగీతం, బాజాల మ్రోతలూ, బాణసంచా వెలుగులూ కామేశ్వరి మనస్సుని జాగ్రదావస్థలోనించి, స్వప్నావస్థలోనికి కొనిపోగలిగాయి. అక్కడికొచ్చిన వివిధ రకాల స్టేటస్‌కి చెందిన తరుణీమణుల బట్టలూ, నగలూ, వాళ్ళ పెదాలుబిగించి నడిచేయకుండా నవ్వే చిరునవ్వులూ, ఆ హుందాతనాలూ, డాబుసరులూ, గర్వోష్టితనాలూ అన్నీ పరిశీలనగాచూస్తూ తన్నితనే మరిచిపోయింది కామేశ్వరి. రజనీశర్మకి లక్షా ముప్ఫయ్‌వేలు కట్నమిచ్చి, యం. ఇ. ప్యాసయి ఫారిన్ వెళ్ళి వచ్చిన వరుణ్ని కొనిపెట్టగలిగారు, యస్. ఇ.గా పనిచేస్తున్న "వేతనశర్మ"గారు. మూడేసి రూపాయలు అప్లికేషన్ ఫీజులు కట్టటానికి మూడు తరాలు తలక్రిందులవ్వాల్సిన పరిస్థితిలో వున్నారు, కామేశ్వరి తండ్రి గోపాలం. రజనీ కామేశ్వరీ కూడా రెండేళ్ళక్రితం యం. ఎ. ప్యాసులయినారు. గోపాలం పెద్ద బట్టలషాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. పాతికేళ్ళక్రితం వందరూపాయలకీ ఇప్పటి రెండువందల రూపాయలకీ సాపత్యమే లేదు. ఆ రోజుల్లో వందరూపాయల జీతంతో, భార్యనీ, ఆరుగురు పిల్లలనీ తేలిగ్గానే పోషించగలిగేవాడు గోపాలం. కామేశ్వరి తల్లి శాంతమ్మ ఎంతో పొదుపయినదీ, నెమ్మదయినదీ. కామేశ్వరికన్నా పెద్దవాడు సుబ్రమణ్యం! స్కూలుఫయినల్ ప్యాసవగానే ఎలక్ట్రిసిటీ ఆఫీసులో చిన్న ఉద్యోగం సంపాయించేసేడు. కామేశ్వరి చిన్నప్పటినుంచీ అన్నిక్లాసుల్లోనూ

ఫస్టుమార్కులు తెచ్చుకునేది. కామేశ్వరి తర్వాత ఇద్దరబ్బాయిలూ తర్వాత గౌరి అనే అమ్మాయీ తర్వాత ఇంకో పిల్లవాడూ ఉన్నారు.

"ఇప్పట్నించీ ఉద్యోగం ఎందుకురా! బి. ఎ. దాకా నన్న చదువుకో" అన్నది శాంతమ్మ.

"అదికాదే! ఈ రోజుల్లో మగాళ్ళకి అంత సులభంగా ఉద్యోగాలు దొరకటంలేదు. కాముడికి బాగా చదువు వస్తోంది. దాన్ని ఎంతవరకు చదివించగలిగితే అంత వరకూ చదివిద్దాం. అది ఉద్యోగంలో జేరినాక అప్పుడు నేను కాలేజీ చదువుతాను. అది ఆడపిల్ల కనక, ఇల్లా చదువగానే అల్లా ఉద్యోగం వచ్చేస్తుంది. నేను ఎంత చదివినా ఎల్లాగూ రెండు మూడేళ్ళు అడ్డమయినవాళ్ళ కాళ్ళూ పట్టుకు వ్రేలాడితేకాని నాకు ఉద్యోగంరాదు" అన్నాడు. కామేశ్వరి అన్న ఔదార్యానికి పొంగిపోయింది.

"అన్నయ్యా! నిజంగా నీలాంటి అన్నయ్య వుండటం నా అదృష్టంరా" అంది.

"మరీ అంత పొగిడేయకే! ఇందులో నా స్వార్థం లేదనుకున్నావా! నీవు ఏ. ఎం. ఏనో ప్యాసయి నాలుగు వందలు తెస్తూంటే, నేను ఏదో నైట్ కాలేజీలో జేరి చదువు సాగిస్తాను. అప్పుడు మనిద్దరం కలిసి చెల్లాయిని తమ్ముళ్ళనీ బాగా పెద్దచదువులు చదివించొచ్చును" అన్నాడు సుబ్రమణ్యం. శాంతమ్మ మారుతున్న కాలంతోపాటు మనః పరివర్తనకూడా అలవాటు చేసుకుంది. అందుకనే ప్రతి ఆడపిల్ల తల్లిలాగా మగవాళ్ళని-ఆడపిల్ల భూమిమీద పడినది

మొదలు పెళ్ళో, పెళ్ళో అంటూ గంగ వెర్రు లెత్తేయించక చల్లగా వీలయినంత పొదుపుగా సంసారం సాగిస్తూ వొచ్చింది. కామేశ్వరికూడా తన బాధ్యతని గుర్తెరిగిన అమ్మాయి! ఎంత బీదరికంలో పెరిగినా యూనివర్సిటీ వాతావరణంలోకి వచ్చేసరికి ప్రతీ ఆడపిల్లా తాను మామూలు మనుష్యులకంటె ఎంతో ఉన్నతమయిన స్థానంలో వున్నట్లు భావించుతూ మసులుతారు. చదువుకున్న ఆడవాళ్ళకున్నంత అహం అదేచదువు చదువుకొంటూన్న మగపిల్లల్లో వుండదు. మగపిల్లల చదువుసంధ్యలు సర్వసాధారణం అయిపోయింది. ఆడపిల్లల పెద్దచదువులు ఇప్పటికీ చెదురుమదురుగానే వుంటున్నాయి. అందుకనే కాలేజీ, యూనివర్శిటీ చదువులు చదివిన స్త్రీలు మామూలు సంసారులైన స్త్రీలతో కలిసిమెలిసి వుండలేరు. ఎంత సంసారం ఒడుదుడుకులు వంటపట్టిన అమ్మాయైనా తోటి విద్యార్థినుల ప్రవర్తన చూసేసరికి తనుకూడా వారిముందు ఎందుకు తీసికట్టుగా కనపడాలీ అన్న తపనకి లోనుఅవుతారు. దానికి తగ్గట్టుగానే ఇంట్లోకూడా పెద్ద చదువు చదువుతూన్న పిల్లల్ని అస్తారు పదంగా చూస్తారు. రోజుకో కొత్త చిగురువేస్తూ బలమైన ఎరువుతో ఏపుగా పెరిగే మొలకని చూసినట్లు ఆప్యాయంగా చూస్తారు. దానితో అమ్మాయిలకు ఇంటాబయటా తామొక ప్రత్యేకత కలిగిన వారమనే భావం ప్రబలుతూ వుంటుంది. కామేశ్వరి కీ అవస్థలేవీ కలగలేదు! అందుకనే రెండేళ్ళ ఎం. ఎ చదువునూ, నాలుగంటే నాలుగే సాదా వాయిల్ చీరలతో చదివేసింది!

తన తల్లి, అన్న, తండ్రి, చెల్లెలు, తమ్ముళ్ళు తనమీద, తన సంపాదనమీద, ఎన్ని ఆశల లేసులు అల్లుకున్నారో ఆ పిల్ల ప్రతిక్షణం గుర్తుపుంచుకునే చదువుకుంది. పుస్తకాలన్నీ కంఠతా పెట్టేసిన కామేశ్వరికి సెకండ్‌క్లాసు రావటం క్లాసు మేట్సుకి అందరికీ ఆశ్చర్యమే కలిగించింది. పాపం ప్రొఫెసర్లు మటుకు ఏమిచేస్తారు! వాళ్ళు మటుకు ధనలక్ష్మికి మానసపుత్రులు కారా? కామేశ్వరి బాచ్‌తో పాటే మృదులా సేన్‌గుప్తా అనే ఒక శ్రీమతి పరీక్షకు వచ్చింది. మిస్టర్ సేన్‌గుప్తాగారు పెద్దపదవిలో ఫారెన్ కంట్రీలో వున్నారుట! మృదులా సేన్‌గుప్తాగారు నిండుగర్భిణీతో ఆయాసపడుతూ ఎగ్జామ్సుకి వచ్చింది. ఆవిడకి ఫస్టుక్లాసు యూనివర్సిటీ సెకండు అయినా ఇస్తేకాని పాపం ఆ అబల ఫారిన్ యూనివర్సిటీల్లో జాగా సంపాదించుకుందుకు వీలుండ దుట! ఆ బాచ్‌లోనే ఒక ప్రొఫెసర్‌గారి మేనల్లుడి బావ మరిదీ, ఇంకో ప్రొఫెసర్‌గారి అల్లుడి తమ్ముడి మరదలుపిల్లా మొదలయిన రాజబంధువులు వున్నారు. ఆ రా(జ)బంధువు లకి ఎల్లానో అల్లా ఫస్టుక్లాసు అయినా గిట్టించకపోతే మరీ మొహమాటంగా వుంటుంది. తెల్లవారి లేచినది మొదలు యూనివర్సిటీలో ముఖముఖాలు చూసుకుంటూ వుంటా రాయె! ఆమాత్రం కోపరేషన్ లేకపోతే ఎల్లాగు? ఇంక ఏ విధమయినటువంటి ఇంటరెస్టూ లేని కామేశ్వరి, మీనాక్షి మొదలయిన వాజమ్మలని సెకండ్ క్లాసులోనికి దింపేసరికి ఆ ప్రొఫెసర్లకి మూడుతరాల పెద్దలూ కనిపించి ముచ్చెమ టలు పోసేయి. వాళ్ళ కళ్ళని కట్టిపడేసే అందచందాలుకాని,

కాళ్లూ చేతులూ కదలకుండా బరువు లెక్కించి పోయేటంత ఆర్థికగురుత్వంకాని లేని కామేశ్వరికి అంతకంటె ఎక్కువ ఎల్లాగు వస్తుంది? అంతమాత్రాన కామేశ్వరి దిగులుపడ లేదు. కామేశ్వరి ఎందుకు చదువుకుంది. కేవలం ఒక ఉద్యోగంకోసం చదువుకుంది. చదువు బాగా వస్తోంది. ఎం. ఏ. ప్యాసు అయినవెంటనే నాలుగొందలు తెచ్చుకునే లెక్చరర్ ఉద్యోగం వస్తుంది. దానితో తమ కుటుంబం ఇప్పుడుంటున్న లోయర్ మిడిల్ క్లాసునించి, ఇంకో మెట్టు పైకి ఎగబ్రాకవచ్చును అనే ఆశయంతో చదివింది. అంతే కాని, యూనివర్సిటీ ఫస్టులూ, బెస్టులూ తెచ్చుకుని ప్రొఫె సర్లకి అభిమానపాత్రురాలై, ప్రొఫెసర్ల ఇళ్ళల్లో బాలసారె లకూ, పురుళ్ళకూ అటెండవుతూ వాళ్ళ కుక్కపిల్లలనీ, పిల్లి పిల్లలని ముద్దాడుతూ, లగ్జరి హోటళ్ళనీ, సినిమాహాళ్ళనీ పర్యవేక్షిస్తూ, ఏళ్ళకి ఏళ్ళ తరబడి రిసెర్చి స్టూడెంటుగా దర్జాలు వలకబోస్తూ జీవించగలననే ఆశతో కామేశ్వరి చదవలేదు. అంచేత ఆ పిల్లకి ఫస్టుక్లాసు రాలేదే అన్న బాధ అంతలేదు. రిజల్సు వచ్చిన మర్నాటినించీ కనపడ్డ ప్రతి అడ్వర్టయిజ్‌మెంటునీ చూస్తూ అప్లికేషన్స్ కొన్ని పెట్టింది. కొన్ని ఉద్యోగాలు పి. ఎ. లు, స్టాఫ్ అసిస్టెంట్స్ లాంటి కంపెనీ ఉద్యోగాలు డిగ్రీచూసి ఇంటర్వ్యూలకు పిలి చినా, చామనఛాయగా పొడుగ్గా మామూలుజడ వేసుకుని సాదా వాయిల్ చీర కట్టుకుని జేబురుమాలులో బస్సు డబ్బులు మూటకట్టుకునివచ్చే కామేశ్వరి వాళ్ళకి నచ్చేది

కాదు. ఇలానే కాలం గడిచిపోతుంది అని బాధపడేది కామేశ్వరి !

"ఏమిటే ! అల్లా నిలువుగుడ్లేసుకుని బిగుసుకుపోయేవ్ !" అంటూ కుదిపింది మీనాక్షి.

"ఏంలేదు ! ఇక్కడంతా అదోలా వున్నారు, కదులే !" అంది కామేశ్వరి.

"వుండకేం జేస్తారు ! పెళ్ళి హుషారు ! నీకు పెళ్ళి అయితే నీకూ అల్లానే వుంటుంది. పద పోదాం !" అంది మీనాక్షి. ఇద్దరూ "రజని"తో చెప్పి ఇవతలకి వచ్చేశారు. ఇంటికి వచ్చేక,

"ఏమే పెళ్ళి బాగా జరిగిందా !" అంది శాంతమ్మ.

"చాలా బాగా చేశారు అమ్మా ! ఆ లైట్లూ అవీ దేవలోకంలా వుంది అనుకో !" అంది కామేశ్వరి.

"వాళ్ళకేం తల్లి ? నోట్లో బంగారం చెంచాతో పుట్టినవాళ్ళు ?" అంది శాంతమ్మ. కూతురికి చదువయిపోయి రెండేళ్ళు దాటినా ఉద్యోగం దొరకకపోవటం శాంతమ్మకి కష్టంగానే వుంది. కామేశ్వరికి ఇరవయినాలుగేళ్లు వసున్నాయి. కామేశ్వరి ఈడు పిల్లలు, మధ్యతరగతి సంసారుల ఇళ్లల్లో అయితే అప్పుడే ఇద్దరుముగ్గురు పిల్లలతల్లులయిపోయి, కాన్పులకి ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నాలలోకూడా వున్నారు. వున్న స్థితికన్నా కాస్తంత పైమెట్టుకి జరగాలన్న ఆశతో మగపిల్లవాడి చదువుకూడా మాన్పించేసి కామేశ్వరికి చెప్పించారు చదువు ! ఈ పిల్ల ఇంత చదువు చదువుకున్నందువల్ల వచ్చిన లాభం ఏమిటి ! అటు ఉద్యోగమా

వరించటంలేదు. ఇటు పెళ్ళికొడుకులూ తమ కుటుంబపు పరిధిలోనికి ఇమిడిపోయే పెళ్ళికొడుకులు అంత చదువుకున్న పిల్ల మాకెందుకు అనేస్తున్నారు. చదువు, సంస్కారమూ అని పెద్ద డబ్బాలెక్చర్లు కొట్టే "భాగధేయులు" ఎం. ఎ. డిగ్రీతో పాటు, కారూ ఫ్రిజిడేర్ ఇంటినిండా ఎం. ఎ. లూ, పి. హెచ్. డీలూ వుండే పెద్ద అరిస్టోక్రాట్ బ్యాగ్రౌండూ వున్న లలనని కోరుకుంటారు. మిడిల్ క్లాస్ వాళ్ళు చదువుకున్నా చదువుకోకపోయినా, వాళ్ళకి ఉన్నతవర్గాల వారితో జేరేందుకుగల అవకాశాలకంటె, కష్టపడి పనిచేసి కడుపు నింపుకోగల లోయర్ క్లాసులో జేరేందుకుగల అవకాశాలే ఎక్కువగా వుంటాయి.

ఇల్లా అందని పళ్ళకోసం అర్రులు చాచటం కంటే కామేశ్వరికి చిన్నప్పుడే పెళ్ళిచేసి, అత్తవారింటికి పంపేస్తే, దాని బ్రతుకునకో అర్ధం సాఫల్యం ఏర్పడును. సుబ్రమణ్యానికే ఆ చదువు చెప్పించేస్తే, ఇటు తమ సంసారనావా గాలి వాలుగా జరిగిపోతూ ప్రయాణించేది అనుకున్నది శాంతమ్మ.

"మన మధ్యతరగతి బ్రతుకులు ఇంతేలేవే కాముడూ! ఏ దారిని నడవబోయినా ముళ్ళే గుచ్చుకుంటాయి. ఆడాళ్లకి చప్పున ఉద్యోగాలు వస్తాయిఅంటూ తను కాలేజీలో చదవటం మానేసి నీకు చదువు చెప్పించాడు అన్నయ్య! ఎక్కువ చదువుకోవటంవల్ల నువ్వూ, తక్కువ చదువుకోవటంవల్ల అన్నయ్యా పెళ్ళి సంబంధాల వాళ్ళ లెక్కకి రావటంలేదు. ఈ ఎం ఎ. అన్నయ్యే ప్యాసయివుంటే ఎవరన్నా పెళ్ళివాళ్ళు అయిదారు వేలు కట్నంఇచ్చి పిల్లనిచ్చి

పెళ్ళి చేద్దురు. వాడికి వచ్చే కట్నంతో నీకూ ఏదో సంబంధం చూసి ముడిపెట్టేద్దుము. చూడు. చదువుకుంటే ఏదో ఒరిగి పోతుందని చదివించాము. రెంటికీ చెడ్డ రేవడ అయింది నీ బ్రతుకు" అంది కూతురి తల నిమురుతూ శాంతమ్మ. కామేశ్వరికి ఏదో బాధ అన్పించింది.

"అంతలా దిగులుపడకమ్మా? ఈ వేసంగి సెలవ లాఖరున నాకు ఎక్కడో అక్కడ ఉద్యోగం దొరికితీరుతుంది. అన్నయ్య మనం అనుకున్నట్లు కాలేజీలో చేరి చదవ వచ్చును?" అంటూ తల్లి గుండెల్లో తలదాచుకుంది చిన్న పిల్లలా కామేశ్వరి!

ఒకరోజు ఆఫీసునుంచి ఈలపాట పాడుకుంటూ వొచ్చేడు సుబ్రమణ్యాం, కాఫీగ్లాసు చేతికిస్తూ "ఏమిటి అన్నయ్యా? హుషారు!" అంది కామేశ్వరి.

"నెలాళ్ళక్రితం మా ఆఫీసులో శంకరం అని ఒకబ్బాయి చేరేడు!"

"అతనికో అందమయిన చెల్లాయుందా?" అంది నవ్వుతూ కామేశ్వరి. శాంతమ్మ కొడుకు ఏం చెప్తాడో అని చెవులు దోరపెట్టుకొని నించుంది.

"ఛఛ! ఆ అబ్బాయికి చెల్లెళ్ళు లేరు. అక్కలిద్దరున్నారుట? ఎక్కడో ఉత్తరాదిన సెటిలయిపోయారుట వాళ్ళు. ఇతను బి. కాం. ప్యాసయినాడు. మన శాఖవాళ్ళే "ఎకవుంట్ సెక్షన్"లో చేస్తున్నాడు. డిగ్రీవున్నది, కనుక పైకిపోయే అవకాశం వున్నది. ఇద్దరన్నగార్లూ పెద్ద పొజి

మన్సులోనే వున్నారుట ! నీ కభ్యంతరం లేకపోతే, అతన్తో నిన్ను చూసుకుందుకు రమ్మనమని చెప్పాలనుకుంటున్నాను" అన్నాడు సుబ్రమణ్యాం.

"నాకా ? పెళ్ళా ?" అంది కామేశ్వరి దిగాలుగా.

"అదేమిటి కాముడూ, అట్లా దిగాలుగా అంటావు. నీకేమన్నా వయసుమీరిందనా ! అసలు ఎప్పుడో పెళ్ళి చేయవలసింది. నీ చదువు పూర్తిఅయితే మంచి ఉద్యోగం వస్తుందనీ, నీ ఉద్యోగం అనే త్రాటితోటి సంసారకూపం లోంచి మమ్మల్నికూడా బయటికి లాగుతావనీ అనుకున్నాం! కాలం ఎంతోవేగంగా పరుగెడుతూంది. మనం, నెమ్మదిగా జీర్ణిపోతులాంటి ఆచారాల మత్తు వదిలించుకుని మారుదా మనుకునేసరికి కాలపు విలువ మనం అందలేనంత వేగంగా మారిపోతోంది. అందుకనే మనిషి ఊహలకీ, వాస్తవానికీ పొత్తుకుదరటం లేదు. శంకరం మంచివాడు. పొదుపరి ! నీకు నచ్చితే ఈ సంబంధం మాట్లాడుతాను" అన్నాడు సుబ్రమణ్యాం.

శాంతమ్మ "అతనుమటుకు ఒప్పుకోవద్దా ? అతని కెంత ఆశవున్నదో ?" అన్నది. "అతను అలాంటివాడు కాదు. మన సంగతులన్నీ చెప్పాను. కాముడు ఉద్యోగం చేయటంకూడా తనకిష్టమే అన్నాడు. ఉద్యోగంకూడా తన అన్నగారి బావమరిదితో చెప్పి వేయిస్తానన్నాడు. అతను ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో పెద్ద పొజిషన్‌లో వున్నాడుట ! కట్నం ఆశ అతనికి లేదుట !" అన్నాడు. "కేవలం చదువుకున్న అమ్మాయిని చేసుకోవాలనే అతని ఆశయంట!"

అన్నాడు సుబ్రమణ్యాం. "అయితే ఇంకేం? కాస్త డిగ్రీ తక్కువన్న మాటేకాని అతనూ, కాస్తోకూస్తో సంపాయించు కుంటున్నాడుకదా! ఏమంటావే కాముడూ?" అన్నది శాంతమ్మ. మనస్సులో ఇంతకన్న అవకాశం మరిరాదేమో అన్నదిగులూ, తనకన్న తక్కువ చదువుకున్నవాడే అన్న కించ, కలగాపులగంగా కలచివేస్తూన్నా, పైకి చిన్నగా నవ్వుతూ, "మీ ఇష్టం అమ్మా!" అనేసింది కామేశ్వరి. కామేశ్వరిని చూట్టానికి వొచ్చేడు శంకరం. కాఫీ కలిపి బయటగదిలో కూర్చున్న అన్నగారికీ, శంకరానికీ తెచ్చింది.

"ఈమే మా చెల్లాయ్!" అని పరిచయంచేశాడు సుబ్రమణ్యాం.

"నమస్కారం" అంది కామేశ్వరి.

"సుబ్రమణ్యాం అంతా చెప్పాడు." అన్నాడు శంకరం. 'పొడుగాటి జడ, చామనఛాయగావున్న చారెడేసి కళ్ళతో కళకళ్ళాడుతూన్న కోలముఖం, ఫరవాలేదు. మరీ యూనివర్సిటీ తెలివి అంతా పలకబోయకుండా కుదురుగానే వున్నది.' అనుకున్నాడు శంకరం.

"నేను అలా వెళ్ళివస్తాను." అంటూ సుబ్రమణ్యాం బయటకు జారుకున్నాడు.

"నేను మామూలు గ్రాడ్యుయేట్ ని అని తెల్సుననుకుంటాను." అన్నాడు శంకరం.

"అన్న చెప్పాడు" అంది కామేశ్వరి.

"మరి మీరు నన్ను చేసుకుందుకు ఎందుకు సిద్ధపడ్డారు?" అన్నాడు.

"మీ సందేహం నేను ఎం. ఏ. ప్యాసు అయినా ననేనా !" సూటిగా ప్రశ్నించింది. "అదేం కాదులెండి" నసిగాడు శంకరం.

"అసలు సంగతి చెప్తాను శ్రద్ధగా వినండి !" అంటూ తన్ని ఏ దృక్పథంతో తనవాళ్ళు ఇంత చదువు చదివించినదీ, ఆ ఉద్యోగం రావటం అనేది రోజురోజుకీ ఎలా ఎండమావి అవుతున్నదీ వివరించింది చివరగా.

"ఆడవాళ్ళకయితే గమ్మున ఉద్యోగాలు వచ్చేస్తున్నాయి. అనుకుని మా అన్న, తను డిస్కంటిన్యూ చేసి నన్ను చదివించేడు ! తీరా నేనూ చదువు పూర్తిచేసుకునేసరికి ఆడవాళ్ళకికూడా ఉద్యోగాలు దొరకని పరిస్థితి ఏర్పడింది. నాకు "పెళ్ళి–సంసారసౌఖ్యం"కన్నా, నాకోసం తను చదువుమానుకున్న మా అన్న జీవితం చక్కదిద్దటంముఖ్యం! మీ ధర్మమా అంటూ ఉద్యోగం వస్తే మా అన్నని చదివించాలనుకుంటున్నాను. వాడుకూడా మంచి ఉద్యోగములోకి వచ్చినాక నా డబ్బు తిరిగిఇచ్చేస్తాడు. ఈ రోజుల్లో చదువులు, డిగ్రీలుకాదు. ఎవరి సంపాదన ఎంత ఉన్నదీ అనేదే పెళ్ళికొడుకుల విలువని పెంచుతున్నది. మీరు బి. కాం. ప్యాసయినా నెలకో రెండొందలయాభయిదాకా తెచ్చుకుంటున్నారు. నేను ఎం. ఏ. ప్యాసయినా రెండేళ్ళబట్టి గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాను" అన్నది కామేశ్వరి.

'భలే అమ్మాయే ! ఎం. ఎ. ప్యాసు అయిందికదా ! ఎవళ్ళకాళ్ళో ఒకళ్ళకాళ్ళు పట్టుకుని, ఉద్యోగం వేయించితే

నాలుగయిదొందలు తెచ్చిపోస్తుంది అనుకున్నాను. వాళ్ళ అన్నయ్యని చదివించాలిట ! ఇలాంటి ఒడిదుడుకుల సంసారాలు ఆంధ్రలో లక్షలూ, కోట్లూ వున్నాయి. ఎవళ్ళబాగు, భవిష్యత్తు వాళ్ళు చూసుకోవాలి కాని ఎంతకని ఉద్ధరించగలరు ? అయిదేసి వేలు, ఆరేసి వేలు కట్నాలు ఇస్తాం అంటూ, ముద్దబంతి పూవుల్లాంటి అమ్మాయిలని చూపుతూ తిరుగుతున్నారు ఆడపిల్లల తల్లితండ్రులు ! ఈ పోస్ట్ గ్రాడ్యుయేట్ ని కట్టుకుని, కానీ రాబడి లేకుండా ఈవిడ జీతం అంతా అన్నగారి చదువుకి ధారపోస్తానంటే నేనేంచేయాలి? అటు ఎక్కువ చదువుకున్న భార్య అంటే అందరికీ వేళాకోళంగా వుంటుంది. ఇటు డబ్బుకా, చెడటం ఎందుకొచ్చిన బాధ ? ఏదో మామూలుగా వుంటుందేమో ఇన్ స్టాల్ మెంట్ ప్రకారం, ఏ మోటారుసైకిలో కొనుక్కోవచ్చును. ఇద్దరం సంపాదించుకుని హాయిగా వుండొచ్చును అనుకున్నాను ఇదెక్కడి కుచేలసంసారంబాబూ !" అనుకున్నాడు శంకరం. వారం పదిరోజులు గడిచాక సుబ్రమణ్యం చిన్నముఖం వేసుకుని తల్లితో అన్నాడు "శంకరం వాళ్ళ అన్నగార్లు ఒప్పుకోలేదట. గ్రాడ్యుయేటు అయితే సమ్మంగా ఉంటుంది. మరీ పోస్టుగ్రాడ్యుయేట్ అయితే మనవాళ్ళంతా ఎగతాళి చేస్తారు అన్నారుట. అంచేత మన్ని ఇంకేదయినా సంబంధం ట్రయిచేసుకోమన్నాడు. తనకి ఏమయినా తెలిస్తే చెబుతానన్నాడు."

"తెలిసింది అబ్బాయిగారి గుణం ?" అనుకుంది కామేశ్వరి.

"ఏమో, దానిరాత ఎలావుందో ?" అంది తల్లి శాంతమ్మ. గోపాలం సాయంకాలం షాపునించి వచ్చేక ఈ సంగతి చెప్పి బాధపడింది శాంతమ్మ. "పోనీ మనం ఏం చేయగలం ? మా వర్తకులంతా కలసి జూనియర్ కాలేజీ ఒకటి పెడతారుట ! అందులో తప్పకుండా మన అమ్మాయికి పని ఇప్పిస్తానని మా గుప్తాగారుఅన్నారు. సెలవలాఖరికి ఏదో ఒకటిదారికిపోతుందిలే !" అన్నాడు గోపాలం. ఆ ఆశపాదుకి నీళ్ళుపోస్తూ రోజులు గడుపుతోంది శాంతమ్మ.

"పోనీ అన్నయ్యా ! నన్ను పెళ్ళాడకపోతే పోనీయి ! వాళ్ళ చుట్టాలెవరో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ లో పని చేస్తున్నాడన్నారు కదా ? ఆ శంకరంగారిని కనుక్కోలేక పోయేవ్." అంది కామేశ్వరి ఒకరోజు.

"అతనికెన్ని తెలివితేటలున్నాయనుకున్నావ్ ? నేను అడక్కుండానే వాళ్ళ బంధువు ఫారిన్ టూర్ లో వున్నాడని చెప్పేశాడు. అన్నట్లు అతనికి పెళ్ళికూడ నిశ్చయం అయ్యిందిట. పెళ్ళికూతురు ఏదోబాంక్ లో పనిచేస్తున్నదట! కట్నంకూడా నాలుగువేలు ఇస్తున్నారుట ! ఇతనికి కట్నం తీసుకోటం ఇష్టంలేకపోయినా, పెళ్ళిఖర్చులు అవీ వుంటాయి కదా అని వాళ్ళన్నయ్యలు బలవంతంచేస్తే తీసుకున్నాడుట. వచ్చేనెలలో పెళ్ళిముహూర్తం పెట్టారుట ! నెలరోజులు సెలవుకు అప్లికేషన్ పెట్టాడు !" అన్నాడు సుబ్రమణ్యాం - చదువుకుని ఉద్యోగం చేస్తున్న అమ్మాయిలుకూడా పెళ్ళి కొడుకులని కొనుక్కోవాలన్నమాట: అనుకుంది కామేశ్వరి. ఆ మధ్యన రెండు మూడు ట్యుటోరియల్ కాలేజీల్లో

ప్రయత్నించింది. అక్కడంతా రిటయిరయినవాళ్ళు ఆక్ర మించుకున్నారు. ఇంట్లో పిల్లలు మంచి బట్టలకీ, పెన్నులకీ మారాములు పెడుతూ ఉండేవారు. శాంతమ్మ వాళ్ళని మందలించుతూ అనేది.

"ఇదిగో ఒక్క నెల్లాళ్ళు ఆగండి ! పెద్దక్కకి మంచి ఉద్యోగం వస్తుంది. మొదటిజీతం అందగానే మీా క్కావలసినన్ని బట్టలూ, బొమ్మలూ, ఆటసామాన్లూ అన్నీ కొంటుంది." అలా తల్లి పిల్లలని సముదాయించినప్పుడల్లా, కామేశ్వరి మనస్సు చివుక్కుమనేది. కొత్త కాలేజీ తెరుస్తారన్న వార్తలు, వేసవిఎండ లనంతరం తొలకరిజల్లులా కామేశ్వరి మనస్సులో పన్నీరు నింపింది. "మీా గుప్తాగారితో ఒక మాట చెప్పివుంచండి నాన్నా !" అన్నది.

"నేను చెప్పేవుంచాను. మా గుప్తాగారు కూడా ఆ కమిటీలో మెంబరే ! ముందు కమిటీ ప్రెసిడెంట్, శెక్రటరీ, మెంబర్సు కాండడేట్లకి చోటు చూపించేకే పైవాళ్ళకి ఇస్తారుట ! అందులో నీ గ్రూపు ఇంగ్లీష్ లిటరేచర్ కదా ! ఇంగ్లీష్ ప్రతీ కాలేజీకీ కావాలాయే! నీవేం దిగులుపడకు!" అని భరోసా ఇచ్చేడు గోపాలం.

"కమిటీ కాలేజీల్లో గవర్నమెంటు కాలేజీల్లోలాగ రెగ్యులర్ గా జీతాలు ఇస్తారా ? జిల్లాపరిషత్ స్కూళ్ళ జీతాలలాగ ఏడాదికీ, ఆర్నెల్లకీ వాళ్ళకి తోచినప్పుడు, తోచినంత ఇచ్చి సంతకాలు పెట్టేయించుకుంటారా ?" అంది కామేశ్వరి.

5112
శ్రీకాకుళం



"అబ్బే! ఇంతంత పెద్దచదువులు చదువుకున్న వాళ్ళని అలాంటి లావాదేవీలలో పెట్టరులే! కాస్తో కూస్తో తగ్గించినా, ఏదో నెలకింత అని ఇస్తోనే వుంటారు" అన్నాడు సుబ్రమణ్యాం. గుప్తాగారి షాపులో గోపాలం పాతికేళ్ళబట్టీ పనిచేస్తున్నాడు. నమ్మకస్తుడు, పిల్లలుగలవాడు అని గుప్తాకి గోపాలంమీద అభిమానంగానే వున్నది. ప్రతీ సంక్రాంతి పండగకీ గోపాలం సంసారం అంతటికీ తలోక జతా బట్టలు ఇస్తూ వుంటాడు. పిల్లలు తెలివయినవాళ్ళు, పొదుపయిన వాళ్ళు, చదువు సంధ్యలు అంటే శ్రద్ధలయినవాళ్ళని, వాళ్ళ ఇంట్లో పొగుడుతూ వుంటాడు. అంచేత తప్పకుండా కామేశ్వరికి ఈ ఉద్యోగం వచ్చేసినట్లే అని సంబరపడ్డారు ఇంట్లో అందరూ! ఇంటర్వ్యూకి వెళ్ళివచ్చింది. ఇంక ఇవ్వాళో రేపో ఆర్డర్ రావటమే తరువాయి అనుకుంటున్నారు. ఆ సాయంత్రం మీనాక్షి వచ్చింది.

"నేను బి. యిడి. ట్రయినింగ్ అవుదామనుకుంటున్నానే! నువ్వుకూడా జేర్తావా!" అంది.

"నా కెందుకూ ట్రయినింగ్! 'వాసవగుప్తా కళాశాల'లో ఇంగ్లీష్ లెక్చరర్‌గా జాబ్ రాబోతోంది. అయినా నీకుమటుకెందుకే! నీకూ ఎక్కడో అక్కడ లెక్చరర్ పోష్టు రాకపోతుందా!" అంది కామేశ్వరి.

"నాకు నమ్మకంలేదే! హాయిగా ట్రయినింగ్ అయి వుంటే ఈపాటికి నాలుగేళ్ళ సర్వీసుండేది. అందుకే ఇప్పటికయినా కళ్ళుతెరిచి ట్రయినింగ్ అవుదామని సంకల్పించాను. అన్నట్లు మన రజనికూడా ఆ 'వాసవగుప్తా కళా

శాల'లో లెక్చరర్‌గా జాయినవుతుందట ! తెలుసా నీకు !" అంది మీనాక్షి.

"రజని ఎందుకు చేస్తుంది ఉద్యోగం ! అత్తవారింటికి వెళ్ళదా ఏమిటి ! అయినా రజనికేం తక్కువని ఉద్యోగాని కెగపడటం చెప్పు !" అంది కామేశ్వరి ఆదుర్దాగా ! రజని తండ్రికి ఆ ఊళ్ళో బోలెడు పలుకుబడి వున్నది. యస్. ఇ. గారమ్మాయి, యం. ఇ. గారి భార్యఅయిన రజనికివ్వకుండా తనకెందుకిస్తారు ఆ ఉద్యోగం ! ఇద్దరిదీ ఒకే గ్రూప్ కదా! భగవంతుడా ! ఈ అవకాశంకూడా ఇంకో గ్రద్ద తన్నుకు పోతోందా అని విలవిలలాడింది కామేశ్వరి.

"ఛఛ ఎంత మాటన్నావ్ పిచ్చి కామప్పా ! రజని ఉద్యోగానికి ఎందుకు ఎగబడుతుంది ? ఆమెకేం తక్కువా ? ఆవిడ కాలేజీకివస్తే చాలు. కాలేజీపరపతి, వింధ్యాద్రి నెత్తికెక్కుతుంది ! వాళ్ళు మనలా సంసారాలు ఈదటం కోసం ఉద్యోగాలు చేయరు. మనకి ఉద్యోగం చేయటం జీవితావసరం అయితే వాళ్ళకి ఉద్యోగం చేయటం నాగరిక లక్షణం ! భర్త ప్రొఫెసర్ ! భార్య లెక్చరర్ ! భార్య డాక్టర్ ! భర్త ఇంజనీర్ ! ఇద్దరూ చెరొక కారులోనూ వెళ్ళి తమతమ ఉద్యోగ విధులని నిర్వర్తించి ఇంటికివచ్చి ఆయాలదగ్గర పెరిగే చంటిపిల్లలనూ, సెంట్రల్ స్కూళ్ళలో చదువుకుంటూ సెలవులకువచ్చే పిల్లలనూ, ఒక అరగంట ముద్దులాడి, వంటలక్కలు తయారుచేసే వంటలనూ, పిండి

వంటలనూ టెస్ట్‌చేసి అలా అలా, గాలిలో పూలతరగలలా తేలిపోతూ వుంటారు. అందుకనే వేలకువేలుపోసి డాక్టరు కోర్సులనూ 'మాస్టర్' కోర్సులనూ, చెప్పించినా అంతకు రెట్టింపు డబ్బుపోసి అంతకు పదిరెట్లు డిగ్రీలున్న వరుణ్ని తమ చదువుకున్న ఆడపిల్లలకు కొని పెడుతున్నారు ధనిక తల్లితండ్రులు ! వాళ్ళ డిగ్నిటీ, సంసారం, మనకెన్ని జన్మ లెత్తితే వస్తుందే కామప్పా !" అంది మీనాక్షి.

"ఇలాంటివాళ్ళు ఉద్యోగాల కెగబడ్డంతో నే నిజంగా వుద్యోగావసరంవున్న వాళ్ళకి ఉద్యోగాలు తక్కు వయిపోతున్నాయి. ఇంతమందివున్న కుటుంబానికి, నెలసరి ఆదాయం, ఇంతకన్న ఎక్కువ వుండకూడదు. అని ఒక రూలు పెట్టేయాలి. భర్తకి నెలసరి ఆదాయం, నాలుగు వందలుదాటి ఇద్దరు పిల్లలకన్నా ఎక్కువలేకపోతే ఇంక ఆ భార్యకి ఉద్యోగావకాశం వుండకూడదు ! అలా అయితే కొంతమంది నిరుద్యోగ సమస్యేనా పరిష్కారం అవుతుంది. ఆడాళ్ళుకూడా ఉద్యోగాలు చేయటంనించి మగాళ్ళకూ డా ఉద్యోగాలు కరువు అయ్యాయి అన్న అపవాదుకూడా పోతుంది" అన్నది కామేశ్వరి.

"ఇలారూల్సు పెట్టినంతమాత్రాన లాభంలేదు. వ్యక్తి గతంగా మనుష్యుల్లో మానసిక పరివర్తన రావాలి. వర కట్ననిషేధం బిల్లు ప్యాసు అయింది. దానివల్ల కట్నాలు తగ్గిపోయేయా ? స్త్రీవిద్య ప్రోత్సహించాలి. అంటూ ఎలు

గత్తి చాటేవారు. స్త్రీవిద్య నేర్చుకున్నందువల్ల ఏం లాభం వుంటోంది? ప్రతీవాళ్ళు పొరుగువాళ్ళ గురించి, ఆలోచించు కోవటం నేర్చుకోవాలి! వర్తకాలుచేసి ప్రజల నోళ్ళుకొట్టి లక్షలు లక్షలు లాభాలు ఆర్జించి సాయిబాబాలనూ, తిరుపతి వెంకన్న హుండీలనూ నింపేస్తూ, భక్తాగ్రేసరులు అనిపించుకుంటారు. అలా కాకుండా తమ కుటుంబపు అవసరం గడచిపోయేలా కొన్న సరుకులమీద లాభంవేసుకుని వర్తకం చేయకూడదా? ప్రతీవాళ్ళకీ డబ్బుపోగుచేయాలనే కాంక్ష ఎక్కువయిపోతోంది! అవసరానికిమించిన ఆర్జన ఎందుకు? అనే దృక్పథమూ, సేవానిరతీ ప్రజల మనస్సుని లోబరుచుకుంటే సామాన్య ప్రజలకు ఇంత ఇరుకుబ్రతుకు బ్రతకాల్సిన అవసరంలేనేలేదు! మా వారు ఐ. ఏ. యస్. ఆఫీసర్ అని చెప్పుకుతిరిగే కాలేజీ లెక్చరమ్మలూ, మా ఆవిడ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అని గప్పాలుకొట్టే డి. యం. వోలూ వున్న సమాజం మనది. భర్త వెయ్యిరూపాయలు తెచ్చినా, తాను ఇంకొకరి "నోటిముందు కూడు" పడగొట్టి తానొక ఉద్యోగం సంపాదించితేనే కాని ఈ సొసైటీలో తనకొక డిగ్నిటీ వుండదనే ఫాల్స్ప్రిస్టేజీ ఈ ధనికవర్గం మహిళలలో తొలగిపోవాలి!" అన్నది మీనాక్షి.

"ప్రతి వ్యక్తి తనకాళ్ళమీద తాను నిలబడ గలగాలనుకోవటం వ్యక్తులకి ఆరోగ్యకరమైన, పరివర్తనే! కాని ఇంకొకరి పొట్ట కొట్టేదిగా వుండకూడదు! స్వార్థం పరహింసకి కారణం కాకూడదు! రజనీ ఈ ఉద్యోగంలో జేరిం

తంటే నాకింక ఈ ఉద్యోగం కూడా రాదన్నమాటే !" అన్నది కామేశ్వరి.

"వాళ్ళాయన కీపూరు నచ్చిందట. అంచేత ఇక్కడే ఒక ఆటోమొబైల్ వర్క్ షాపు పెట్టాడుట. భార్యచేత అతనికి ఉద్యోగం చేయించాలని వుందిట. అంచేత రజనిచేత అప్లికేషన్ పడేయించాడుట ! ఉద్యోగం రావటం ఖాయమే అనుకుంటున్నారులే !" అన్నది మీనాక్షి.

నాలుగు రోజులు పోయినాక, తండ్రిముఖం నీరసం, నిస్త్రాణచూసి కాలేజీ ఉద్యోగం రజనికి అంకితం అయి పోయిందని ధృవపరుచుకుంది కామేశ్వరి. తనెందుకు పెద్ద చదువు చదవాలి ? ఆనాడే అన్నయ్యని చదువుకోమని తను చదువు మానేస్తే ఈ పాటికి గుప్పెడన్నం పెట్టగల ఏదో ఒక మగాడికి భార్యగా వుండును. ఇప్పుడు చదువుకోవటం వల్ల ఇటు ఉద్యోగాలూ రావటంలేదు! అటు పెద్ద చదువులు చదువుకున్న మగాళ్ళని వేలుపోసి కొనుక్కోలేరు ! తక్కువ చదువు చదువుకున్న అబ్బాయిలు, తమకన్నా ఎక్కువచదువు కున్న అమ్మాయిలను పెళ్ళిళ్ళు చేసుకుందుకు ముందుకు రావటానికి జంకుతున్నారు ! చదువుకోకుండా మొద్దల్లైవుంటే ఏ వ్యవసాయ కూలీనయినా పెళ్ళి చేసుకోవచ్చును ! నాగరికత ప్రబలుతున్నకొద్దీ మధ్యతరగతి ఆడపిల్లల జీవితాలు మరీ అగచాట్ల పాలవుతున్నాయి ! ఉన్నత వర్గాల మహిళలు, పెద్ద చదువులు చదువుకో కూడదనికాదు. అవకాశం వున్నంతమటుకు, మెదడు పని చేసినంతమటుకు చదువుకోవ

చ్చును. వాళ్లు విజ్ఞాన సముపార్జన, నిమిత్తం ఎంత డబ్బు అయినా ఖర్చుచేసి చదువుకోవచ్చును. ఉద్యోగాలు మటుకూ చేస్తే తప్ప సంసారం గడవని పరిస్థితిలో వున్నప్పుడే చేయాలి. అలా చేస్తే కామేశ్వరిలాంటి అమ్మాయిలు వేల కొద్దీవున్న తెలుగు దేశంలో మేమెందుకు చదవాలి? అని బాధపడే అవసరంరాదు. అంతవరకూ, మన ప్రగతి కదలని బాటలో నిలబడే వుంటుంది.